
సాక్షి
విజయనగరం
సోమవారం ၊ 10 ၊ మార్చి ၊ 2025



పోలిపల్లి పైడితల్లమ్మ జాతర

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవంగా పేరొందిన రాజాంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ 99వ జాతర ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. - 8లో



అంగన్‌వాడీల ఆందోళన అణిచివేతకు కుట్ర..! - 8లో

రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సోమవారం చలో విజయవాడ కార్యక్రమాన్ని అంగన్‌వాడీలు తలపెట్టారు.



న్యూస్‌రీల్

నేటి నుంచి పీజీఆర్‌ఎస్ పునఃప్రారంభం

విజయనగరం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) స్పందన కార్యక్రమాన్ని సోమవారం నుంచి పునఃప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో గత కొన్ని వారాలుగా స్పందన కార్యక్రమాన్ని నిలిపివేసిన విషయం తెలిసిందే. ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో యథావిధిగా గ్రీవెన్స్‌సెల్ నిర్వహిస్తామని ఈ అవకాశాన్ని అర్జీదారులు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు.

నేడు ఎస్పీ గ్రీవెన్స్‌సెల్

విజయనగరం క్రైమ్ : జిల్లాలో ఎమ్మెల్సీ కోడ్ ఎత్తేయడంతో తమ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం యథావిధిగా నిర్వహించనున్నట్లు ఎస్పీ వకుల్ జిందల్ ఆదివారం తెలిపారు. ఇకపై ప్రతీ సోమవారం ఈ కార్యక్రమం చేపడతామని వెల్లడించారు. వినతులు స్వీకరిస్తామని తెలిపారు.

ప్రారంభమైన శ్రీనివాసుని కల్యాణోత్సవం



పల్లకిలో ఊరేగుతున్న శ్రీవారు

దెంకాడ: చింతలవలస ఐదవ ఏపీఎస్‌పీ బెటాలియన్ వద్ద ఉన్న వేంకటేశ్వసా మి ఆలయంలో స్వామి 41వ వార్షిక కల్యాణ మహోత్సవ పూజలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం వేదపండితుల మంత్రోచ్ఛారణతో పూజలు నిర్వహించారు. సాయంత్రం తిరువీధి ఘనంగా నిర్వహించారు.

డైట్ చార్జీలు విడుదల

సాక్షి ఎఫెక్ట్...

పూసపాటిరేగ: బీసీ సంక్షేమ వసతిగృహాలకు డైట్ చార్జీలు రిలీజ్ చేస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారి పెంటోజీరావు ఆదివారం తెలిపారు. వసతిగృహాలకు డైట్ చార్జీలు చెల్లించకపోవడంపై సాక్షి దినపత్రికలో ఈ నెల 8వ తేదీన నిర్లక్ష్యపు నీడ శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయనగరం జిల్లాకు రూ.2.31కోట్లు మూడో క్వార్టర్ బడ్జెట్‌లో భాగంగా మంజూరు చేశారని జిల్లా బీసీ సంక్షేమాధికారి తెలిపారు.



యువత పోరుకు తరలిరండి

- 12న విద్యార్థులు, నిరుద్యోగ యువతకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ పోరుబాట
- తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్
- కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ.. కలెక్టర్‌కు వినతి
- అదే రోజున జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం
- రెండు కార్యక్రమాలు విజయవంతం చేయాలి
- యువత పోరు పోస్టర్ల ఆవిష్కరణలో జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



యువత పోరు పోస్టర్‌ను విడుదల చేసిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు తదితరులు

విజయనగరం:

సార్వత్రిక ఎన్నికలకు ముందు మోసకారి హామీలిచ్చి విద్యార్థులు, యువత జీవితాలతో ఆటలాడుకుంటున్న కూటమి ప్రభుత్వానికి కళ్లు తెరిపించేలా ఈ నెల 12న తలపెట్టిన యువత పోరు కార్యక్రమానికి విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ధర్మపురిలో సిరిసహస్ర రైజింగ్ ప్యాలెస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ విద్యార్థి, యువజన విభాగ నాయకులతో కలిసి యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యార్థులు, నిరుద్యోగ యువతకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు తెలియపర్చటంతో పాటు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు యువత పోరు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. ఈ నెల 12వ తేదీ ఉదయం 9 గంటలకు నెహ్రూ యువ కేంద్రం సమీపంలో గల మున్సిపల్ పార్కు నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం జిల్లా కలెక్టర్‌కు వివిధ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాలను అందజేస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మెగా డీఎస్సీ నిర్వహిస్తామని, ఏడాదికి 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని లేని పక్షంలో నిరుద్యోగులకు నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీలు ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయడం లేదన్నారు. హామీల అమలు కోసం చేస్తున్న పోరాటంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసే దిశగా అడుగులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గతంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించగా... అందులో 5 కళాశాలలను ప్రారంభించటం జరిగిందని చెప్పారు. విజయనగరం ప్రజలకు పైడితల్లమ్మవారి సాక్షిగా ఇచ్చిన మెడికల్ కళాశాల హామీని నేరవేర్చి చూపించారన్నారు. మరో 5 కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుడితే 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేసే దిశగా అడుగులు వేయటం దురదృష్టకరమన్నారు. తద్వారా ఉచితంగా అందాల్సిన విద్యను కార్పొరేట్ వ్యాపారంగా మార్చేందుకు చూస్తున్నారన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల ఏవి?

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగంలో విద్యను ప్రాథమిక హక్కుగా పొందుపరిచిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. అదే ధృక్పథంతో ప్రతి అర్హుడైన పేదవాడు ఉన్నత చదవులు అభ్యసించాలనే ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మొట్టమొదటిగా ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టడం ద్వారా అనేక మంది యువత, విద్యార్థులు ఇంజినీర్లు, డాక్టర్‌లుగా ఎదిగి సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. అటువంటి గొప్ప పథకాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. 2014–19 టీడీపీ హయాంలో ఫీజురీయింబర్స్ నిధులు విడుదల చేయకుండా కార్పొరేట్ విద్యా సంస్థలను ప్రోత్సహించిందన్నారు. అనంతరం 2019–24 వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మరల ఫీజు రీయింబర్స్ పథకాన్ని అమలు చేసి ఉన్నత చదువులకు జీవం పోశారని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో చేపట్టిన సంస్కరణలో ప్రభుత్వ పాఠశాలలో నో వేకెన్సీ బోర్డులు పెట్టడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలతో పాటు అమ్మ ఒడి పథకాన్ని అమలు చేసి పేద విద్యార్థులకు అండగా నిలిచారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవటంతో విద్యార్థులకు కళాశాలల యాజమాన్యాలు నోటీసులు జారీ చేసి ఇబ్బందులకు గురి చేస్తుంటే అధికార యంత్రాంగంతో హాల్ టిక్కెట్లు ఇవ్వాలని సంబంధిత యజమాన్యాలకు చెప్పించటమే తప్ప నిధులు విడుదల చేయకపోవటం దారుణమని పేర్కొన్నారు.

20 లక్షల ఉద్యోగులు... రూ.3వేల నిరుద్యోగ భృతి ఏమయ్యాయి..



ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చిన కూటమి ప్రభుత్వ సారథి ముఖ్యమంత్రితో పాటు ఇతర మంత్రులు వాటి అమల్లో ఘోర వైఫల్యం చెందారని తూర్పరబట్టారు. తాము అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని లేని పక్షంలో నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి ఇస్తా మని ప్రకటించి ఏడాది కావస్తున్నా ఎక్కడ ఆచరణకు నోచుకోలేదన్నారు. ఓట్లేసిన యువత మోసపోయారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండు బడ్జెట్ సమావేశాల్లో కనీస కేటాయింపులు చేయకపోవటం పాలనకు నిదర్శనంగా నిలుస్తోందన్నారు. ప్రతి నిరుద్యోగ యువతకు రూ.72వేల బకాయి పడిందని గుర్తు చేశారు.

హామీల అమలుపై అడ్డగోలు ప్రకటనలు



అధికార దాహంతో ఎన్నికలకు ముందు హామీలు గుప్పించిన కూటమి నేతలు వాటి అమలుపై నేడు అడ్డగోలు ప్రకటనలు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో స్వయాన ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రచార కార్యక్రమాల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని, బస్సు ఎక్కి కండక్టర్‌కు చంద్రబాబు చెబితే చాలని రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చని చెప్పటం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం ఆయన నాయకత్వంలోని ప్రజాప్రతినిధులు మేము అలాంటి హామీలు ఇవ్వలేదని , కేవలం జిల్లా పరిధి వరకే ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని చెప్పటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తల్లికి వందనం పథకం అమలుపై బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు చేయటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. పింఛన్ల మంజూరులో కూడా తొలగింపులే తప్ప కొత్తవి ఇచ్చిన పాపాన పోలేదని, ఇదే విషయాన్ని సంబంధిత మంత్రి స్వయంగా వెల్లడిస్తున్నారన్నారు.

అదే రోజు వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక దినోత్సవం

అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజాపక్షాన నిలబడే వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఈ నెల 12న జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని మజ్జి శ్రీనివాసరావు సూచించారు. ఆ రోజు అన్ని నియోజకవర్గాల్లో సంబంధిత ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వర్రి నర్సింహమూర్తి, కొప్పలవెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు, విద్యార్థి విభాగం అధ్యక్షుడు కరుమజ్జి సాయి, మహిళా విభాగం అధ్యక్షురాలు సత్యలత, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, మాజీ రాష్ట్ర కార్యదర్శి కెవి.సూర్యనారాయణరాజు, పార్టీ నాయకులు బోడసింగి ఈశ్వరరావు, విద్యార్థి విభాగం నాయకులు బోనెల తరుణ్, ధీరుయాదవ్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో వర్గపోరుకు మరింత ఆజ్యం!

- కావలి గ్రీష్మకు ఎమ్మెల్సీ
- గత ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటు ఆశించిన గ్రీష్మ
- అడ్డుకున్న కోండ్రు వర్గం
- ఇప్పుడు ఎమ్మెల్సీ పదవితో తెరపైకి
- ఇదివరకే ఉమెన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు
- ఇంతలోనే మరో పదవి
- ఆశపడ్డ కిమిడి నాగార్జున, కొల్ల అప్పలనాయుడు, గొంప కృష్ణ, తదితరులకు భంగపాటు
- కోండ్రుకు చెక్ పెట్టే దిశగా అధిష్టానం
- తెరవెనుక పెద్ద నేత



ఎమ్మెల్సీగా అవకాశం దక్కించుకున్న కావలి గ్రీష్మ

రాజాం :

టీడీపీని నమ్ముకుని 2019 సార్వత్రిక ఎన్నికల్లో తల్లి భంగపడింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూతురుకు నిరాశే మిగిలింది. తల్లీకూతుళ్లిద్దరు ఇంటిముఖం పట్టేశారని అందరూ అనుకున్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో ఇంతలోనే కుమార్తెకు నామినేటెడ్ పదవి ఇచ్చి కొంత మేర ఉపశమనం. ఆ పదవి కూడా రాకుండా అడ్డుకున్న మరో వర్గానికి మరో షాక్ తగిలేలా ఎమ్మెల్సీ పదవి ఆమెకు లభించింది. ఆమె రాజాం నియోజకవర్గంలో సంతకవిటి మండలం కావలి గ్రామానికి చెందిన కావలి గ్రీష్మ. ఈమె తల్లి కావలి ప్రతిభా భారతి సీనియర్ టీడీపీ నాయకురాలు. ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి 1983, 1985, 1989, 1994, 1999లో ఐదు దఫాలు ఎమ్మెల్యేగా గెలుపొంది, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి మహిళా స్పీకర్‌గా పని చేశారు. 27 ఏళ్లకే ఎన్‌టీఆర్ మంత్రివర్గంలో క్యాబినెట్ ర్యాంకు మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. నియోజకవర్గాల విభజన తరువాత వరుసగా రాజాం నియోజకవర్గం నుంచి రెండు పర్యాయాలు పోటీ చేసి ఓటమి చెందారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నుంచి కోండ్రు మురళీమోహన్ టీడీపీలోకి వచ్చి ప్రతిభా భారతికి 2019లో టిక్కెట్ దక్కకుండా చేశారు. 2024లో ప్రతిభాభారతి కుమార్తె గ్రీష్మ టిక్కెట్ కోసం ప్రయత్నించగా, ఆమెకు కూడా టిక్కెట్ రాకుండా అడ్డుకట్టు వేసి టిక్కెట్ తాను దక్కించుకోవడమే కాకుండా ఎమ్మెల్యేగా గెలిచిన కోండ్రు సిట్టింగ్ అభ్యర్థి, సీనియర్ నాయకురాలైన కావలి ప్రతిభాభారతి కుటుంబానికి ప్రాధాన్యత లేకుండా చేశారు. దీంతో అటు ప్రతిభాభారతితో పాటు ఆమె కుమార్తె గ్రీష్మ విశాఖపట్నంకు పరిమితమయ్యారు. టీడీపీ అధికారంలో లేని సమయంలో పార్టీ తరఫున కార్యక్రమాలకు సొంత ఆస్తులు తగలబెట్టడమే కాకుండా అధికార పార్టీపై ఇష్టానుసారం మాటలిసిరిన కావలి గ్రీష్మకు నిరాశే మిగిలింది. అనంతరం జరిగిన పరిణామాల్లో గ్రీష్మకు టీడీపీ ఉమెన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చైర్‌పర్సన్ పదవిని కట్టబెట్టింది. దీంతో మళ్లీ తెరమీదకు వచ్చిన గ్రీష్మకు ఇంతలోనే ఎమ్మెల్సీగా టిక్కెట్ లభించింది.

ఆశావహులకు చెక్

రాష్ట్ర వ్యాప్తంగా ఆశావహులు, సీనియర్ నేతలు పదుల సంఖ్యలో నామినేటెడ్ పదవుల నిమిత్తం ఎదురు చూస్తున్నారు. ఇందులో విజయనగరం జిల్లా నుంచి కిమిడి నాగార్జున, కర్రోతు బంగారాజు, గొంప కృష్ణ, బొబ్బిలి చిరంజీవులు, కేఏ నాయుడు, కొల్ల అప్పలనాయుడు, తెంటు లక్ష్మునాయుడు తదితరులు ఉన్నారు. కావలి గ్రీష్మకు మూడు నెలలు క్రితమే ఉమెన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చైర్‌పర్సన్ పదవి ఇవ్వడంతో ఆమె పేరు ఎవరూ ఊహించలేదు. కిమిడి నాగార్జున, గొంప కృష్ణ, కొల్ల అప్పలనాయుడు, కేఏ నాయుడులాంటి నేతల పేర్లు తప్పించి, గ్రీష్మకు ఎమ్మెల్సీ పదవి రావడం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఈ పదవి వెనుక రాజాం నియోజకవర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నేత హస్తం ఉందనేది పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది.

అడ్రస్ లేని ఆ నేతలు

టీడీపీ కష్టకాలంలో ఉన్న సమయంలో పార్టీ పార్లమెంట్ అధ్యక్షులుగా, జిల్లాకు పెద్ద దిక్కు గా కిమిడి నాగార్జున వ్యవహరించారు. 2024లో చీపురుపల్లి నియోజకవర్గం నుంచి టిక్కెట్ ఆయనకు దక్కకుండా పార్టీ వ్యవహరించింది. కనీసం ఎమ్మెల్సీ పదవి వస్తుందని ఆశపడ్డ ఆయనకు నిరాశే మిగిలింది. ఆయన పేరు ఈ నామినేటెడ్ పదవుల్లో అడ్రస్ లేకుండా పోయింది. గొంప కృష్ణ, కేఏ నాయుడు, కొల్ల అప్పలనాయుడు తదితర నేతల పరిస్థితి కూడా ఇదే మా దిరిగా మారింది. వీరిప్పుడు అధిష్టానం నిర్ణయాన్ని కక్కలేని, మింగలేని పరిస్థితిలో ఉన్నారు.

ఎవరికి చెక్ పెట్టేందుకు..

రాజాం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యేగా కోండ్రు గెలిచిన తరువాత మంత్రి పదవి ఆశించారు. కనీసం విప్‌గా అవకాశం వస్తుందని చూశారు. ఈ రెండు లేకపోయేసరికి ఆయన వర్గంలో అలజడి ప్రారంభం అయ్యింది. కోండ్రు కూడా పెద్దగా నియోజకవర్గంలో పార్టీ క్యాడర్ సమస్యలపై దృష్టి పెట్టడం లేదని, ఇక్కడ ఉండడం లేదనే గుసగుసలు ఉన్నాయి. అతని సోదరుడు జగదీష్ కనుసన్నల్లోనే మొత్తం తంతు జరుగుతోంది. దీంతో కావలి ప్రతిభాభారతి వర్గీయులతో పాటు కిమిడి కళావెంకటరావు వర్గీయులు, ఆది నుంచి టీడీపీని నమ్ముకున్న టీడీపీ కార్యకర్తలు ఈ విషయాన్ని అధిష్టానానికి చేరవేశారని తెలుస్తుంది. ఫలితంగా కావలి గ్రీష్మకు ఎన్‌ఫోర్స్‌మెంట్ చైర్మన్ పదవి ఇచ్చి తెరమీదకు తెచ్చినా ఆమెకు ఎమ్మెల్యే వర్గం ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ఎమ్మెల్సీ పదవిని ఇచ్చి నియోజకవర్గంలో టీడీపీ పాత వర్గానికి లోకేష్ టీం జీవం పోసిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు రాజాం నియోజకవర్గంలో కోండ్రు మురళీమోహన్‌తో సమానంగా కావలి గ్రీష్మకు ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో, కార్యక్రమంలో కుర్చీ వేయాల్సి ఉంటుందని, కోండ్రుకు చెక్‌పెట్టే ప్రయత్నంలో భాగంగానే ఈ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారనే వార్తలు ఊపందుకున్నాయి. ఇంకో వైపు సంతకవిటి మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నేత కొల్ల అప్పలనాయుడు కూడా ఈ ఎమ్మెల్సీ పదవిపై ఆశలు పెట్టుకున్నప్పటికీ ఆయనకు ఈ పదవి ఇవ్వకపోవడంతో సంతకవిటి మండలంలో కొల్ల వర్గీయులు టీడీపీ తీరును తప్పుపడుతున్నారు.



కొల్ల అప్పలనాయుడు



కిమిడి నాగార్జున



గొంప కృష్ణ

ప్రభుత్వ ఆస్పత్రుల్లో.. ఎలక్ట్రీషియన్ల కొరత..!

- వంద పడకలకు ఒక ఎలక్ట్రీషియన్ అవసరం
- ప్రభుత్వ వైద్య కళాశాలలో ఒకే ఒక్కడు
- ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 150 వరకు ఏసీలు
- కానీ ఒక్క ఏసీ మెకానిక్ కూడా లేరు..
- మరమ్మతులు, మెయింటెనెన్స్ పేరిట ప్రైవేటు వారికి రూ.లక్షల చెల్లింపు
- ఎలక్ట్రీషియన్ల కొరతతో సేవల్లో జాప్యం





విజయనగరం ఫోర్ట్:

ఆస్పత్రుల్లో చికిత్స పొందే రోగులకు 24 గంటలూ విద్యుత్ సరఫరా అందుబాటులో ఉండాలి. ఐసీయూ, అత్యవసర విభాగాల్లో చికిత్స పొందే రోగులకు ఒక్క క్షణం విద్యుత్ సరఫరా నిలిచిపోయినా చెప్పలేనంత ఇబ్బంది నెలకొంటుంది. కొందరు రోగులకైతే విద్యుత్ ప్రాణాధారమేనని చెప్పాలి. ఆటువంటి విద్యుత్ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించి, సమస్యలను పరిష్కరించే ఎలక్ట్రీషియన్ల కొరత ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉంది. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే సేవల్లో జాప్యం ఏర్పడుతుంది. జిల్లాకు పెద్దదిక్కుగా ఉన్న ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఎలక్ట్రీషియన్ల కొరత నెలకొంది.

100 బెడ్‌లకు ఒక ఎలక్ట్రీషియన్

నిబంధనల ప్రకారం 100 బెడ్‌లకు ఒక ఎలక్ట్రీషియన్ ఉండాలి. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ఘోషాస్పత్రిల్లో 430 బెడ్స్ ఉన్నాయి. సర్వజన ఆస్పత్రికి ఘోషాస్పత్రి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ లెక్కన రెండు ఆస్పత్రుల్లో ఐదుగురు ఎలక్ట్రీషియన్లు ఉండాలి. కానీ రెండు ఆస్పత్రుల్లో ముగ్గురే ఉన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిల్లో ఇద్దరు, ఘోషాస్పత్రిలో ఒకరు ఉన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మేల్, ఫీమేల్ జనరల్ వార్డులు, మేల్, ఫీమేల్ జి.ఈ వార్డులు, మేల్, ఫీమేల్ ఆర్థో వార్డులు, క్యాజువాలటీ, 30 పడకలు ఐసీయూ, స్టెప్ డౌన్ ఐసీయూ, ఎమర్జెన్సీ వార్డు, బ్లడ్ బ్యాంక్, ల్యాబొరేటరీ, ఓపీవిభాగాలు, ఎక్సరే, ఈసీజీ, అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఎంఆర్ఐ స్కాన్, సీటీ స్కాన్ విభాగాలు ఉన్నాయి. ఐసీయూ, క్యాజువాలటీ, ఎమర్జెన్సీ వార్డుల్లో చికిత్స పొందే రోగులకు విద్యుత్ ఒక సెకన్ కూడా ఆగకూడదు. పొరపాటున విద్యుత్ సరఫరా నిలిచిపోతే రోగులు తీవ్ర ఇబ్బందే పడే అవకాశం ఉంది. ఈ విభాగాల్లో వెంటిలేటర్, సెంట్రల్ ఆక్సిజన్ సిస్టమ్ ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు నిరంతరాయంగా ఆక్సిజన్ అందాలి. అలా అందాలంటే విద్యుత్ నిరంతరాయంగా సరఫరా కావాలి. ఎలక్ట్రీషియన్ల కొరత వల్ల రోగులకు సేవల్లో జాప్యం ఏర్పడుతుందనే విమర్శలున్నాయి. వీరిద్దరిలో ఏ ఒక్కరు సెలవు పెట్టినా ఒక్క ఎలక్ట్రీషియన్ విధులు నిర్వహించాల్సి ఉంటుంది. 24 గంటల పాటు ఒక్కరు విధులు నిర్వహించడం అనేది కష్టతరమే. ఘోషాస్పత్రిలో 20 పడకల నవజాతి శిశువుల ప్రత్యేక సంరక్షణ కేంద్రం (ఎస్ఎన్‌సీయూ) ఉంది. వీరికి సెంట్రల్ ఆక్సిజన్ సిస్టమ్ ఉంది. ఈ సిస్టమ్ ద్వారా నవజాతి శిశువులకు ఆక్సిజన్ అందుతుంది. ఎస్ఎన్‌సీయూలో వార్మర్‌లు, ఫోటోథెరిపి పరికరాలు ఉన్నాయి. ఇవి కూడా విద్యుత్ పైనే ఆధారపడి నడుస్తాయి. వీరితో పాటు గర్భిణులకు హైరిస్క్ గర్భిణుల కోసం ఇక్కడ ఐసీయూ కూడా ఉంది. అదేవిధంగా పిల్లల వార్డు, గర్భిణులు వార్డు ఉంది. ఇక్కడ ఒకే ఎలక్ట్రీషియన్ ఉన్నారు. ఏదైనా సమస్య వస్తే ఒక్కడే కావడంతో సేవల్లో జాప్యం ఏర్పడుతుందని రోగులు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ఎదైనా సమస్య వస్తే సకాలంలో సమస్య పరిష్కారం కావడం లేదనే ఆవేదన రోగుల్లో ఉంది.

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 150 ఏసీలు

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 150 వరకు ఏసీలు ఉన్నాయి. ఐసీయూ, ఎమర్జెన్సీ వార్డు, బ్లడ్ బ్యాంక్, ఎంఆర్ఐ స్కాన్, సీటీ స్కాన్ వంటి వాటిల్లో ఏసీలు నిరంతరాయంగా పని చేయాలి. వీటికి ఏదైనా సమస్య వస్తే రిఫర్ చేయడానికి ఏసీ మెకానిక్ కూడాలేరు. ఏసీలు మరమ్మతులకు గురైతే రోజుల తరబడి బాగు చేయించడం లేదనే వాదన ఉంది. ఏసీలు బాగు చేయడానికి ఏడాదికి ఒకసారి నిర్వహించే మెయింటెనెన్స్ కోసం లక్షలాది రుపాయిలు ప్రైవేటు సంస్థకు చెల్లిస్తున్నారు. ఏసీ మెకానిక్ ఉంటే చాలా వరకు ప్రజాధనం సాదా అయ్యేదనే అభిప్రాయం సర్వత్రా వినిపిస్తుంది.

ఒకే ఒక్కడు

ప్రభుత్వ వైద్య కళాశాలలో కూడా ఒకే ఒక్క ఎలక్ట్రీషియన్ ఉన్నారు. 150 మంది వైద్య విద్యార్థులు ఇక్కడ వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి సంబంధించి క్లాస్ రూమ్స్, ల్యాబ్‌లు, విద్యార్థుల హాస్టల్ గదులు ఉన్నాయి. ఇక్కడ కూడా విద్యుత్ అనేది నిరంతరాయంగా ఉండాలి. కానీ ఒక్కరే ఉండడంతో సేవల్లో జాప్యం ఏర్పడుతుందనే వాదన ఉంది.



సర్వజన ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న ఎలక్ట్రీషియన్లు

నోటిఫికేషన్ ఇచ్చాం..

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఇద్దరు, ఘోషాస్పత్రిలో ఒకరు ఎలక్ట్రీషియన్ ఉన్నారు. ఇద్దరు ఎలక్ట్రికల్ అసిస్టెంట్స్ పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చాం. త్వరలోనే భర్తీ అవుతుంది. వైద్య కళాశాలకు కూడా ఒక ఎలక్ట్రికల్ అసిస్టెంట్ పోస్టు భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చాం. ఏసీ మెకానిక్ లేరు. ఏసీలు మరమ్మతులు, మెయింటెనెన్స్ పనులు ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా ప్రైవేటు ఏజెన్సీ వారు చేస్తారు.

– డాక్టర్ సంబంగి అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

క్లుప్తంగా

మూగజీవులు సజీవ దహనం



మంటల్లో కాలిపోయిన గొర్రెలు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని పరజపాడు గ్రామంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మూగజీవాలు ఉన్న పశువుల శాలకు నిప్పంటించారు. ఈ మేరకు జరిగిన ప్రమాదంలో రెండు గొర్రెలు, 20 కోళ్లు సజీవ దహనమైనట్లు గ్రామానికి చెందిన గుంట్రెడ్డి శివున్నాయుడు ఆదివారం చినమేరంగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.అనీష్ ఆదివారం తెలిపారు.

33 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

తెర్లాం: మండలంలోని డి.గదబవలస గ్రామంలో అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి ఆదివారం తెర్లాం ఎస్సై సాగర్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డి.గదబవలస గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 33 మద్యం సీసాలు తీసుకు వెళ్తున్నట్లు శనివారం రాత్రి సమాచారం రావడంతో దారికాచి ఆ వ్యక్తిని మద్యం సీసాలతో పట్టుకున్నామని తెలిపారు. ఆ వ్యక్తి గ్రామంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నాడని చెప్పారు. ఎప్పటిలాగానే మద్యం సీసాలు విక్రయించేందుకు తీసుకు వెళ్తుండగా పట్టుకుని 33 మద్యం సీసాలను సీజ్ చేయడంతో పాటు అరెస్ట్ చేశామన్నారు.

1500 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం



బెల్లం ఊటలు పారబోస్తున్న పోలీసులు

సీతంపేట: మండలంలోని నెల్లిగండి కొండల ప్రాంతంలో సారా వండడానికి నిల్వచేసిన 1500 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం చేసినట్టు ఎస్సై వై.అమ్మన్నరావు తెలిపారు. సారా వంటకాలు జరుగుతున్నాయనే సమాచారం రావడంతో తమ సిబ్బందితో దాడులు చేయగా 20 డ్రమ్ములతో నిండి ఉన్న బెల్లం ఊటలు లభించగా ధ్వంసం చేసినట్లు తెలిపారు.

నేరాలను అదుపు చేసేందుకు సీరియల్ నంబర్లు

- ఎస్పీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: నేరాలను అదుపుచేసేందుకు ఒకే పట్టణం, ఒకే ఆటో ఒకే సంఖ్య విధానాన్ని అమలు చేయనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆటో యూనియన్లు, ఎన్ని ఆటోలు ఉన్నాయి. యజమానులు, డ్రైవర్లు, ఆటోలకు సంబంధించిన రికార్డుల అన్ని వివరాలు ఆయా స్టేషన్‌లలో నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ వల్ల పక్క రాష్ట్రాల నుంచి, వేరే ప్రాంతాల నుంచి వచ్చే ఆటోల సమాచారం, అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను నిరోధించేందుకు, కనుగొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే ప్రమాదాలు జరిగినప్పుడు తప్పించుకుని వెళ్లేందుకు ప్రయత్నించే ఆటోల వివరాల కూడా ఈ సంఖ్యల ద్వారా గుర్తించగలమని అభిప్రాయ పడ్డారు. ఈ నమోదు ప్రక్రియపై ఇటీవల జిల్లావ్యాప్తంగా ఆయా స్టేషన్ల సిబ్బందికి మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు.

సెల్‌ఫోన్‌లో టెన్త్ హాల్‌టికెట్

పార్వతీపురం: వాట్సాప్ గవర్నెన్స్‌లో భాగంగా పదోతరగతి హాల్ టికెట్స్‌ను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. దీంతో పదోతరగతి విద్యార్థులు ఎక్కడికీ వెళ్లకుండా తమ చేతిలో ఉన్న సెల్‌ఫోన్ ద్వారా హాల్‌టికెట్ తీసుకునే వెసులుబాటు కల్పించింది. హాల్‌టికెట్ తీసుకోవడానికి విద్యార్థులు ఫోన్ 9552300009 నంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయ్ అని మెసేజ్ చేస్తే..ఏ సేవ కావాలో ఎంచుకోవాలని వస్తుంది. అక్కడ విద్యను ఎంపిక చేసుకోవాలి, పదో తరగతి హాల్ టికెట్స్ విభాగాలు కనిపిస్తాయి. పదో తరగతి హాల్ టికెట్స్‌ను ఎంపిక చేసుకుని విద్యార్థి ఐడీ, పుట్టిన తేదీవంటి వివరాలను నమోదు చేస్తే పీడీఎఫ్ రూపంలో హాల్‌టికెట్ డౌన్‌లోడ్ అవుతుంది.

ఏడుగురు జూదరుల అరెస్టు

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మండలంలోని లక్ష్మీనారాయణపురం గ్రామం పరిధిలో గల వ్యవసాయ పొలాల్లో జూదం ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు దాడి చేసి జూదం ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి దగ్గర నుంచి రూ.15,050 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు, జూదం ఆడుతున్న వారిలో ఒక మహిళ కూడా ఉన్నట్లు ఎస్సై చెప్పారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	190

అంగరంగ వైభవంగా...
పోలిపల్లి పైడితల్లమ్మ జాతర

- వేలాదిగా తరలివస్తున్న భక్తులు
- మూడు రోజుల పాటు నిర్వహణ
- సేవా కార్యక్రమాల్లో అధికారులు, స్వచ్ఛంద సంస్థలు



గర్భగుడిలో పుష్పాలంకరణలో యాత్రకు ముస్తాబైన పోలిపల్లి పైడితల్లి అమ్మవారు

రాజాం/రాజాం సిటీ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవంగా పేరొందిన రాజాంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ 99వ జాతర ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే జాతరలో తొలి రోజు నుంచే పైడితల్లి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. భక్తులతో బొబ్బిలి రోడ్డులో జనసందోహం నెలకొంది.

అమ్మవారి కొలువు ఇలా...

పట్టణ పరిధిలోని కొండంపేట గ్రామానికి చెందిన లంకలపల్లి వంశీకులు వెంకప్ప ఒకనాడు విజయనగరం జిల్లా పోలిపల్లి గ్రామంలో యాత్రకు కుటుంబంతో వెళ్లాడు. జాతరను చూసి తిరిగి వస్తుండగా కొంతదూరం వచ్చేసరికి ఎవరో బండి ఎక్కినట్లు, బండి బరువెక్కి ఎడ్లు లాగడానికి కష్టంగా తోచడంతో వెనుదిరిగి చూశాడు. ఎవరూ కనిపించలేదు. అలాగే ఆ చీకటిలో ప్రయాణం చేసి కొండంపేట పరిసరాలకు వచ్చేసరికి ఎవరో బండిపై నుంచి కిందకు దూకినట్లు గజ్జల ధ్వని వినిపించింది. ఇంతలో నేను పైడితల్లిని పోలిపల్లి నుంచి నీ బండిపై వచ్చాను. ఈ పనస చెట్టుపై కొలువుంటానని పలికినట్లు ఆయనకు వినిపించింది. వెంకప్ప అమ్మవారిని భక్తితో నమస్కరించి ఇంటికి చేరుకొని ఈ విషయాన్ని బంధుమిత్రులకు చెప్పగా అప్పటి నుంచి అమ్మవారు కొలువున్న పనస చెట్టు ఆయన వంశీకులు, గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల వారు పసుపు కుంకుమలు ఇచ్చి పూజించడం ప్రారంభించారు.

నమ్మకం ఇలా..

రాజాం పట్టణానికి చెందిన వ్యాపారి వాకచర్ల మల్లయ్య కోర్టు వ్యవహారాల్లో చిక్కుకొని తరచు పార్వతీపురం కోర్టుకు వెళ్తుండేవారు. కేసులు ఎంతకీ తేలక నష్టాల పాలయ్యారు. ఇలాంటి పరిస్థితిలో అమ్మవారు కలలో కనిపించి పనస చెట్టు వద్ద తనకు గుడి కట్టించమని కోరింది. మరునాడు ఆయన కోర్టు వ్యవహారాలపై పార్వతీపురం వెళ్తూ అమ్మవారికి నమస్కరించి కోర్టు వ్యవహారంలో జయం కలిగితే తప్పకుండా ఆలయం కట్టిస్తానని మొక్కుకున్నాడు. అనుకున్నదే తడవుగా కోర్టు వ్యవహారంలో గెలవడమే కాక దొంగలపాలైన అతని ధనం తిరిగి లభించింది. ఆ సంతోషంతో అమ్మవారిని దర్శించి ఆలయ నిర్మాణానికి ఏర్పాట్లు ప్రారంభించారు. తన స్నేహితులైన పీసపాటి సత్యన్నారాయణాచార్యులు, పొట్టా సత్యన్నారాయణ, సలాది వెంకటప్పడు, గుడివాడ పెంటయ్య సహాయంతో వాస్తు పండితుడైన మజ్జి రమణయ్య సూచనలతో 1926లో ఆలయ నిర్మాణం మొదలుపెట్టి 1927 నాటికి పూర్తి చేశారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది ఫాల్గుణమాసం శుక్లపక్షంన పౌర్ణమి ముందు వచ్చే ఆది, సోమ, మంగళవారాల్లో అమ్మవారి జాతర అత్యంత వైభవంగా రాజాంలో జరుగుతుంది.

400 మంది సిబ్బందితో బందోబస్తు

ఉత్తరాంధ్రలో ప్రసిద్ధిగాంచిన పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. 400 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేశామని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. జాతరను పర్యవేక్షించేందుకు 27 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు డ్రోన్స్ సహాయంతో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.


సేవా కార్యక్రమాల్లో సంస్థలు

రాజాం పట్టణానికి చెందిన సత్యసాయి సేవా సంస్థలు, వాసవీ క్లబ్ సభ్యులు, రెడ్‌క్రాస్ బృందంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలు ప్రారంభించాయి. రాజాం పట్టణం జాతర సందర్భంగా కళకళలాడుతోంది. ఆలయ ఆవరణలో విద్యుత్ దీపాలంకరణ కనువిందు చేస్తుంది.



విద్యుత్ కాంతులతో ఆలయం

వైభవంగా పునర్వసు పట్టాభిషేకం



స్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



అభిషేక ప్రియుడిగా దర్శనమిస్తున్న స్వామివారు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పునర్వసు పట్టాభిషేకం కార్యక్రమాన్ని అర్చకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరకాండ హవనం జరిపించారు. అనంతరం ఆలయంలో వెండి మంటపం వద్ద సీతారామస్వామిని నూతన పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించి స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవ ఘట్టాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉత్సవమూర్తుల వద్ద రామాయణంలో పట్టాభిషేకం సర్గ విన్నవించి శ్రీరామచంద్రమూర్తికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫలరసాలతో విశేష అభిషేకాలు, పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

'శతర' కవితా సంపుటి ఆవిష్కరణ



శతర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ తదితరులు (ఫైల్)

పార్వతీపురం: తాను రచించిన 'శతర' ఆదివాసీ కవితా సంపుటిని ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్‌లో నిర్వహించిన ద్వితీయ తెలుగు మహాసభల్లో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ.రమణ శనివారం ఆవిష్కరించారని ప్రముఖ కవి సిరికి స్వామినాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన తన స్వగృహంలో మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన తెలుగు మహాసభల్లో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారని చెప్పారు. 'శతర' పుస్తకంలో అడవుల్లోని అందాలు, గిరిజనుల ఆచారాలు, సంప్రదాయాలు, విద్య, ఆరోగ్యం, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా గిరిజనుల విధానంలో మార్పు తదితర అంశాలను పొందుపరిచినట్లు వివరించారు. తాను రాసిన కవితా సంపుటికి దేశంలో గుర్తింపు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

రాత్రి 11గంటల తరువాత సంచరించొద్దు



కమాండ్ కంట్రోల్ ద్వారా సిబ్బందికి ఆదేశాలు ఇస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: సహేతుకమైన కారణం లేకుండా అర్ధరాత్రి నగరంలో తిరిగితే టౌన్ న్యూసెన్స్ చట్టం కింద కేసులు నమోదు చేస్తామని ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరించారు. ఈ మేరకు నగరంలోని బ్యారెక్స్ వద్ద ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి అన్ని స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు కొన్ని కఠిన నిర్ణయాలు తప్పవని, అందుకు అనుగుణంగా పోలీస్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. విజయనగరంలో రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, మూడు లాంతర్లు, కోట జంక్షన్, బాలాజీ జంక్షన్, దాసన్నపేట రైతుబజార్, రింగు రోడ్డు, కొత్తపేట, ఐస్ ఫ్యాక్టరీ, జమ్ము, వీటీ అగ్రహారం, బొబ్బిలి, నెల్లిమర్ల, రాజాం మున్సిపాల్టీల్లో కొన్ని ముఖ్య ప్రాంతాల్లోను పోలీసులు తనిఖీలు చేపడుతున్నారన్నారు. రాత్రి 11గంటల తరువాత వ్యాపారాలు, షాపులు, టిఫిన్ బండ్లు మూసివేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యాపారాలు సాగించినా, కారణాలు లేకుండా బహిరంగ ప్రదేశాల్లో సంచరించిన వారిపై టౌన్ న్యూసెన్స్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కేసు నమోదు చేసిన వారిని స్టేషన్‌కు పిలిపించి, వారి తల్లిదండ్రులను రప్పించి, కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. నేరాల నియంత్రణలో భాగంగా ఇప్పటివరకు రాత్రి గస్తీల్లోను, పెట్రోలింగ్ నిర్వహించడంలో మౌలికమైన మార్పులను చేపట్టారు. రాత్రి పెట్రోలింగ్, గస్తీ విధులకు వెళ్లే పోలీసు సిబ్బందితో సంబంధిత పోలీసు అధికారులు సమావేశమై, రాత్రి గస్తీలో నిర్వహించాల్సిన విధుల పట్ల వారికి దిశానిర్దేశం చేస్తున్నట్లు చెప్పారు. ఇక రాత్రి గస్తీ, పెట్రోలింగ్ నిర్వహించే పోలీసు సిబ్బంది తమ వెంట తప్పనిసరిగా విజిల్స్, లాఠీలను తప్పనిసరిగా తీసుకుని వెళ్లాలని ఆదేశించారు. కాగా జిల్లా వ్యాప్తంగా జనవరి నుంచి ఇప్పటివరకు 850 మందిపై టౌన్ న్యూసెన్స్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి, కౌన్సెలింగ్ నిర్వహించామని ఎస్పీ చెప్పారు.

రాజకీయాలకు అతీతంగా టీచర్లకు సేవలందిస్తా

- ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు



సత్కారం పొందుతున్న టీచర్స్ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు

విజయనగరం అర్బన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే అజెండాగా రాజకీయాలకు అతీతంగా సేవలు అందిస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులు నాయుడు ఉద్ఘాటించారు. పీఆర్‌టీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తోటపాలెంలోని ప్రైవేట్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఈ మేరకు ఆయన స్పష్టం చేశారు. తాను ఎన్నికైన తరువాత ముఖ్యమంత్రిని కలిసిన సమయంలో ఆయన దృష్టికి ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగంలోని సమస్యలను తీసుకెళ్లానని వివరించారు. ప్రభుత్వానికి ఉపాధ్యాయులకు మధ్య వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రధానకార్యదర్శి వి.రవీంద్రనాయుడు, ఆర్.రాంబాబు, బంకపల్లి శివప్రసాద్, ఆల్తి రాంబాబు, డెక్క వెంకటరావు, శంకర్‌నాయుడు, వివిధ మండల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. అదే విధంగా ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సంఘం కార్యాలయంలో ఎమ్మెల్సీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ఉపాధ్యా ప్రగతి ప్రధాన సంపాదకుడు జి.సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు ఎ.సదాశివరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.ఈశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి పి.ధనుంజయరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మధుసూదన రావు, డి.వెంకటనాయుడు, ఆరు జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, పీఆర్‌టీయూ జిల్లా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చినమేరంగి సర్కిల్ ఆఫీసుకు ఐదుగురు ట్రైనీ ఎస్సైలు



నూతనంగా బాధ్యతలు చేపట్టిన ట్రైనీ ఎస్సైలు

జియ్యమ్మవలస రూరల్: పోలీస్ సూపరింటెండెంట్ ఎస్వీ మాధవ్‌రెడ్డి ఆదేశాల మేరకు జియ్యమ్మవలస మండలంలోని చినమేరంగి సర్కిల్ ఆఫీస్‌లో ఐదుగురు ట్రైనీ ఎస్సైలు ఆదివారం విధుల్లో చేరారు. ఈ మేరకు ఎస్సై పి.అనీష్ వారిని అభినందిస్తూ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాధవ్ రెడ్డి మాట్లాడుతూ నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన చినమేరంగి, జియ్యమ్మవలస పోలీస్‌స్టేషన్‌లలో ట్రైనీ ఎస్సైలు నియమితులయ్యారని, వారంతా సీఐ వీటీ తిరుపతిరావు పర్యవేక్షణలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కమ్యూనిటీ పోలీసులతో పాటు వారిలో చినమేరంగికి ఎం.అనిల్ రెడ్డి, వి.మణికంఠేశ్వర రెడ్డి, వై జ్యోతిలను నియమించగా, జియ్యమ్మవలస పోలీస్‌స్టేషన్‌లో వి.నారాయణరెడ్డి, వి ప్రదీప్‌లు విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

పిల్లలు తల్లిదండ్రుల ప్రతిబింబాలు

- డీఈఓ యూ.మాణిక్యం నాయుడు



వార్షికోత్సవాల్లో ఆకట్టుకున్న చిన్నారుల ఆటపాటల ప్రదర్శన

విజయనగరం అర్బన్: విద్యార్థులు బాల్యంలో తమ తల్లిదండ్రులను అనుకరిస్తారని వారికి మంచి విద్య ద్వారానే వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి యూ.మాణిక్యం నాయుడు అన్నారు. ఈ మేరకు స్థానిక గురజాడ పాఠశాలలో ఆదివారం జరిగిన 27వ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విలువలతో కూడిన అత్యుత్తమ విద్యను అందించడానికి విద్యాసంస్థలు ఉత్తమ నిర్వహణతో పాటు విద్యార్థి వ్యక్తిత్వంపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపడం అవసరమన్నారు. విద్యార్థి దశ నుంచి విద్యతోపాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కళాప్రదర్శన, చిన్నారుల ఆటపాటలు తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. పాఠశాల కరెస్పాండెంట్ స్వరూప ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్సీ రఘువర్మ, రిటైర్డ్ డీఈఓ అరుణకుమారి, పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎంవీఆర్‌కృష్ణాజీ, ప్రధానోపాధ్యాయుడు పూడి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సేవలతోనే మెరుగైన సమాజం

విజయనగరం గంటస్తంభం: సమాజంలోని మహిళలు తమ సేవలు పూర్తిస్థాయిలో అందిస్తేనే మెరుగైన సమాజం ఏర్పడుతుందని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఈ మేరకు ఆదివారం గురజాడ పబ్లిక్ స్కూల్‌లో సారథి వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీ అమ్మా సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని మహిళా సంఘాల ప్రతినిధులను ఒక వేదికపైకి తీసుకువచ్చి సత్కరించడం అభినందనీయమని, సారథి వెల్ఫేర్ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్ వెంకటరావు చేసిన పనిని జిల్లాలోని మహిళా ఎమ్మెల్యేలు, మహిళా అధికారులు చేస్తే బాగుండేదని భీశెట్టి అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన కొత్త పారిశ్రామిక విధానంలో మహిళలు తమకు సరిపడ పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. మహిళల కోసం అనేక చట్టాల్లో మార్పులు తెచ్చినప్పటికీ అనుకున్న స్థాయిలో మహిళలకు ఉపయోగపడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో లక్కీ శేఖర్, మహిళా సంఘాల నేతలు వెంకటలక్ష్మి, కాంచన, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన అణిచివేతకు కుట్ర..!



హౌస్‌అరెస్టులో ఉన్న జిల్లా అధ్యక్షురాలు పైడిరాజు

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సోమవారం చలో విజయవాడ కార్యక్రమాన్ని అంగన్‌వాడీలు తలపెట్టారు. అంగన్‌వాడీల ఆందోళనను అణిచివేసేందకు కూటమి ప్రభుత్వం అధికారులతో కుట్ర చేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈనెల 10వతేదీన చలో విజయవాడ పేరిట ధర్నా చేస్తామని అంగన్‌వాడీలు ముందుస్తుగా ఐసీడీఎస్ సీడీపీఓలకు వినపతి పత్రం ఇచ్చారు. తీరా రేపు సమావేశం అనగా ఆందోళనకు వెళ్లొద్దని నేరుగా చెప్పకుండా ప్రతి ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీలకు తెలియజేశారు. సమావేశానికి కచ్చితంగా ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త హాజరు కావాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరికలు కూడా జారీ చేసినట్లు సమాచారం. ముందుగా సెలవు పెట్టిన వారి దరఖాస్తులు సైతం తిరస్కరించాలని సూపర్‌వైజర్లకు అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. జిల్లాలో ఉన్న 90 సెక్టార్లలోనూ సమావేశాలు నిర్వహించనున్నారు.

యూనియన్ నాయకుల హౌస్ అరెస్టులు

అంగన్‌వాడీ యూనియన్ నాయకులు విజయవాడలో జరిగే ఆందోళనలో పాల్గొనకుండా పోలీసులు వారిని హౌస్ అరెస్టు చేస్తున్నారు. విజయనగరంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి.పైడిరాజు, జిల్లా కమిటీ సభ్యురాలు తులసిలను హౌస్ అరెస్టు చేశారు.

జిల్లావ్యాప్తంగా సమావేశాలు

జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని సెక్టార్లలో సమావేశాలు నిర్వహించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు అన్ని సెక్టార్లలో సమావేశాలు నిర్వహించనున్నాం.

జి.ప్రసన్న, ఇన్‌చార్జి పీడీ, ఐసీడీఎస్

హెడ్ స్లూయిస్ షట్టర్ల మార్పిడి

- పరిశీలించిన డీఈ రవీంద్ర నాయుడు



పనులను పరిశీలిస్తున్న డీఈ వై.రవీంద్రనాయుడు



వేసేందుకు సిద్ధంగా ఉన్న షట్టర్లు

సంతకవిటి: మండలంలోని ప్రధాన సాగునీటి వనరైన నారాయణపురం ఆనకట్టలో దాదాపు రూ.35లక్షల వ్యయంతో హెడ్ స్లూయిస్ షట్టర్ల మార్పిడి పనులు ప్రారంభించారు. కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా శివారు ఆయకట్టు రైతులకు నీరు అందించడంలో ఈ షట్టర్లదే ప్రధాన భూమిక. ఈ ఆనకట్ట నుంచి కుడి ప్రధాన కాలువ ద్వారా 18691 ఎకరాలకు, ఎడమ ప్రధాన కాలువ ద్వారా 18362 ఎరాలకు సాగునీరు అందుతుంది. ఈ మేరకు డీఈ వై.రవీంద్రనాయుడు ఆదివారం పనులను పరిశీలించారు. వారంరోజుల్లో ఆనకట్ట షట్టర్లు మార్పిడి పనులు పూర్తిచేసి సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డీఈ తెలిపారు.



నారాయణపురం ఆనకట్ట